''ఎందుకేంది? వాడు పత్యాకం మనింట్లనే కనబడ బట్టె! నేను ఇంటికి ఎప్పుడచ్చినా.. వాడూ, ఇదీ నవ్వు కుంటనే ఉందురు'' అని చెప్పింది.

''అయితె.. నవ్వుకుంట ఉండంగనె వాండ్ల నడుమ ఏందో ఉన్నట్టేనా? ఇంటికి రావొద్దని గాయినెతోని చెప్ప నుంటివి. వానితోని మాట్లాడొద్దని నీ కోడలికి చెప్పనుం టివి. ఉండగూడని తరీకల అవుపడితె.. గప్పుడే బైటికెల్లి తలుపుగొల్లెంపెట్టి నలుగుర్ని పిలిచేటిదుండె! గప్పుడే తెలుస్తుండె గద! ఉత్త అనుమానంతోని పిల్లను ఇడిశి పెడ్తరా?!''.. అఫ్జల్ కంఠం కఠినంగా ధ్వనించింది.

మరో పెద్దమనిషి యాకూబ్ కల్పించుకుని..

''అరె! మొత్తం కనుక్కుంటె గద అనుమానమా, నిజమా? సమజ్ అయితది! ఎవలు చెప్పేటిది వాండ్లు జెప్తరు.. అందరు మాట్లాడినంక ఫయిస్లా అయితది'' అన్నాడు.. రసూల్‌బీ వైపు పర్వాలేదన్నట్టు చూస్తూ.

''నయీమ్! నువ్వేమంటవో చెప్పు! సంసారం నీది. సఫియా నీ పెండ్లాం, మీకిద్దరు ఆడి పిల్లలున్నరు. ఓ కొడుకున్నడు. మీ అమ్మ నిన్నొక్కణ్ని మొగడులేకున్నా కష్టపడి పెంచింది. రేపుమల్ల సఫియా సుత మీ పిల్లల్ను గట్నే ఒక్కతే పెంచాల్నా?! మంచిచెడ్డ ఆలోచించుకొని చెప్పు. కావాల్నంటె.. మీరిద్దరు పక్కకు పొయ్యి మాట్లా డుకోని రాండి!'' అన్నాడు అఫ్జల్ స్థిరంగా.

''అబ్బో! అది మాట్లాడిందంటే నాకొడుకు మనసు తిప్పిపారేస్తది. వొట్టి బోగరిది! మాట్లాడుడులేదు, ఏంలేదు. పంచాయతీకాడికి వొచ్చినంక ఇంకేంది?'' అన్నది రసూల్‌బీ.

నయీమ్ తల్లివైపు కొత్తగా.. ఇప్పుడే చూస్తున్నట్టు చూశాడు. తన చిన్నప్పటినుంచీ అబ్బాజాన్ లేని ఇంట్లో అమ్మీ, నానీ ఎంత కష్టపడ్డారో తెలుసు. కానీ, అమ్మీని ఇట్లా ఎన్నడూ చూడలేదు. ఎందుకు సఫియా అంటె ఖిలాఫ్ అయిందో తెలుస్తలేదు. పాపం.. సఫియా మంచి దేగద! అట్లచేస్తదా!? ఏమో?! ఏం చెప్పాల్నో తోస్తలేదు. ఒకదిక్కు షబ్నమ్‌ను చూడుమని సలీంభాయ్ తనెంబడి పడుతున్నడు.

''నయీమ్ అటెంక మాట్లాడుతడు. ముందుగాల సఫియా ఏం జెప్తదో చెప్పుమనుండి'' అన్నాడు యాకూబ్.

అఫ్జల్ సరేనని.. సఫియావైపు చూశాడు.

అవమానం, భయం, అభద్రత, దుఃఖం గుండెలోంచి తన్నుకువస్తుంటే.. మాట్లాడలేకపోయింది సఫియా.

''ఏం చెప్తది? అవద్దమైతె గద.. బద్మాష్ ఆడిది! షరంలేదు! ఇంక మాటలేంది? ఇడుపు గాయిదం రాసు కోవాలె!''.. అక్కసుగా అన్నది రసూల్‌బీ.

''అరే! తూ జరా రుకో.. బోల్నేదో! సఫియా.. ఏమం టవ్ చెప్పు?!'' అఫ్జల్ కల్పించుకున్నాడు.

సఫియా గొంతు సవరించుకున్నది.

''ఏం చెప్పాలె కాకా! నా బతుకే బర్బాద్ అయింది. అల్లాకీ కసమ్.. నేనేమీ తప్పుజెయ్యలే! నాభర్త తప్పిచ్చి ఇంకొకడు తెల్వదు నాకు. నా పిల్లల మీదొట్టు! గిట్ల బద్నాం చెయ్యాల్నంటె.. నేను చూసిన సంగతి చెప్పాల్నా మరి?!''.. ఒరకంట అత్తను చూస్తూ అన్నది.

రసూల్‌బీ తినేసేటట్టు చూసింది కోడల్ని.

''నేను మంచిగ చదువుకునేటప్పుడు.. మా బావకు పిల్లనెవరు ఇయ్యకుంటె, గప్పుడు పదేండ్లు చిన్నదాన్న యిన నన్నిచ్చి పెండ్లిచేసిన్రు. మా రెండెకరాల భూమి యాడపోతదో అని మా ఆయన పేరుమీద రాయించుకు న్నరు. ఆయన ఏపని సక్కగ జెయ్యకున్నా గని.. ఆయన దిక్కునుంచి గూడ నేనే తిట్లుతిన్న. నాకు రాకున్నా నాట్లు, కలుపు పనికి కూడా పోయి కూలితెచ్చిన. కొసకు మిషిన్ కుట్టుకుంట సంపాయిస్తున్న. గీయినను మస్క ట్‌కు పంపిచ్చేదిసుత నాకు ముందుగాల తెల్వది. ఆడికెల్లి ఆయన ఎన్ని పైసలు పంపిండో నాకు ఎవ్వలు చెప్ప కున్నా.. 'అయితెమానె తియ్యి! మా సంసారం గురించే నాయె!' అనుకున్న. ఏమన్న కొనుక్కొచ్చేదానికి గూడ వాళ్లమ్మ ఏమనుకుంటదో అని భయపడేటోడు. ఎన్ని తిప్పలవడ్డనో నాకే ఎరుక. మొగపిల్లగాడు పుట్టాల్నని, ఆపరేషన్ చేయించుకోవద్దని మా అత్త పట్టుపడితె ఊకున్న. నా భర్త ఏడాదికో రెండేండ్లకో ఒకసారొస్తడు. నెలో, రెణ్నెల్లో ఉండి మల్లపోతడు. గప్పుడే మేం మాట్లాడుకునేది. సంసారంచేసేది''..

సిగ్గుతో ఓక్షణం ఆగింది సఫియా. అందరూ శ్రద్ధగా వింటున్నారు.

''నేను గర్భవతిని గాంగనే మా అత్తకు భయ్యం.. మల్ల ఆడిపిల్ల పుడతదేమోనని! ఎవలితోనో మందుపోపి స్తది. ఆడిపిల్లయితే పోతది.. మొగపిల్లగాడయితె నిలుస్తది అని! ఆ మందేంటిదో అల్లాకే ఎరుక! అసలు గటువంటి మందు ఉంటదా? ఒద్దంటె ఇనదు. నాకు పేగులు తెగి పోయేటంత బాధ! గట్ల రెండుసార్లు అబార్షన్ అయింది. గుండ్రాయి లెక్క ఉండేదాన్ని.. పీనుగలెక్క అయిన! నోరులేని పాణాలను తీసిన పాపం తగుల్తదని చెప్పరా నంత దుఃఖమొస్తాంది. ఈతాప ఎట్లనో మత్సరిచ్చి గా చెట్లమందు తాగలే! గీ పోరడు పుట్టిండు. వీని గురించి అనుమానపడితే నేనేడపోవాలె? కావాల్నంటె ఇవ్వాల రేపు గా పరీక్షలు ఏవో చేస్తాన్రటగద.. చేయించున్రి! ఎవల కొడుకో తెలుస్తది. గీయిన తొమ్మిదేండ్ల సంది దూరదేశాన ఉంటాండు. మరి ఎవలితోటి ఉంటాండో నని నేను అనుమాన పడ్డనా? మనిషిమీద నమ్మకముం డాలె. నాకు తల్లిలేదు, తండ్రి ఉన్నా పట్టిచ్చుకోడు. ఇగ మా తమ్ముడు అన్వర్.. ఏమన్న మాట్లాడితె వాణ్ని చిన్న పోరని లెక్క చూస్తాన్రు. నేనేం జెయ్యాలె?! అగ్గిల దుంకాల్నా!? నిప్పు ముట్టుకోవాల్నా?!''..

దుఃఖంతో గొంతు పూడుకుపోయింది సఫియాకు. ఎవరూ మాట్లాడలేదు.

''ఇంతకు ఏమంటవమ్మా? మీ అత్త షికాయత్ మీద నువ్వు చెప్పేది చెప్పు!'' యాకూబ్ అన్నాడు.. ఓరకంట రసూల్‌బీ జేవురించిన ముఖంలోకి చూస్తూ.

''గదే చెప్తున్న చిచ్చా! ఏడేళ్ల కింద దాది చచ్చిన కాణ్నుంచి పొల్లగాళ్లకు, మా అత్తకు, నాకు జరమొచ్చినా, దగ్గుపడిసెం పట్టినా.. ఆరెంపీ డాక్టర్ సదానందమే చూసె టోడు. పైసలు ఎక్వ అయితయని పెద్దడాక్టర్ కాడికి పోని య్యది మా అత్త. నాకు నిరుడు పదిరోజులు జరమొచ్చి నోట్లె నీళ్లు పొయ్యకుంటె.. గాయినే తక్వజేసిండు. ఇంటి కొచ్చి గుల్కోసులు పెట్టిండు. గాయినె భార్యకు జాకిట్లు కుట్టి.. మందుల బాకి తీరుస్తుంట. 'అన్నా!' అని పిలిసే మనిషితోని నాకు అంటగడ్తదా? మరి నన్ను ఖుద్ద చూస్నె.. అప్పుడే పట్టుకోకపోయిందా? గిదంత ఎందు కంటె.. మా ఆయన పెద్దమ్మ కొడుక్కు మరదలున్నది. గాపిల్ల గీయినెను చేసుకుంటనని జిద్దు చేస్తాందట. వాళ్లు ఉన్నోళ్లే గనుక.. చేసుకుంటె మస్తు పైసలొస్తయ్. భూమి జాగలిస్తరు. గా పిల్ల రెండు కండీషన్లు పెట్టిందట. నాలెక్క అత్తను జూసుకుంట గీడ ఉండదు. మస్కట్ పొయ్యి మొగనితోని ఉంటది. అయితెమాయె.. మనిం డ్లల్ల ఎందర్ని జేసుకున్నా తప్పులేదని వీళ్లు ఊకుందా మంటె.. నాకు ఇడుపుగాయిదం ఇస్తెనే నా మొగన్ని చేసు కుంట అన్నదట గా షబ్నమ్. మరి కుట్టేటోళ్లు కుడితెనే చెవులు నొయ్యయి. గా పిల్లను చేసుకుంటె పైసలొచ్చె, మస్కట్‌ల కొడుకుతోటి ఉండె కోడలొచ్చె. మరి గిదంత ఉత్తగైతాది?! నా మీద నిందేస్తెనే ఐతది''.. సఫియా ఆగింది.

తనింకా ఏం చెప్పనిదే షబ్నమ్ సంగతి సఫియాకెలా తెలిసిందా!? అని ఆశ్చర్యం నిండిన కళ్లతో నయీమ్ చూస్తే, ఆగ్రహం నిండిన కళ్లతో రసూల్‌బీ చూసింది.

మళ్లీ అన్నది సఫియా..

''మా ఆయన మొగనిగ ఉన్నదానికీ, తలాక్ ఇచ్చి నంక సుత నాకేమి ఫరక్ పడేటట్టు లేదు. రెండేండ్లకు ఓసారి వొచ్చిపోంగనె నేను నెలతప్పుడు, విషమసొంటి మందు మింగుడు, లేకుంటె పిల్లలగనుడు.. గింతే గద! తలిస్తెనే భయమైతాంది. ఏడాదంత నా తిప్పలు నాకే! నా చాకిరి నాకే! అయ్యలారా.. మంచిదే! నాకు తలాక్ ఇప్పిచ్చున్రి. మా అమ్మ బాపతు రెండెకరాల పొలం నాదినాకు మెహర్ కింద ఎన్కకు ఇయ్యమనున్రి. ఇద్దరు బిడ్డలు, కొడుకు నాతోనే ఉంటరు. కన్నంక అయ్యకు తప్పినా.. నాకు తప్పుదు కద! వీండ్ల సదువులు, పెండ్లిళ్లు అన్నిటికి గలిపి ఎంతైతదో ఇప్పుడే వాళ్ల పేరుమీన పైసలు డిపాజిట్ చెయ్యమనున్రి. ఇగనుంచి వీళ్లకు నాయినేగని.. నాకు మొగడు కాడు!''..

రసూల్‌బీ చూపులతోనే కాల్చేసింది కోడల్ని. పెద్దమ నుషులు యాకూబ్, అఫ్జల్ చర్చించుకుంటున్నారు. ఇక మాట్లాడేది నయీమ్‌వంతు అన్నట్లు అతనివైపు చూశారు.

అప్పటిదాకా కళ్లూ, చెవులూ అప్పగించి.. సఫియా చెప్పే మాటలు వింటూ, ఆమెనే చూస్తున్న నయీమ్.. ఈసారి తలపట్టుకుని నిస్సహాయంగా చూడలేదు. అలా గని తల్లివైపు కూడా చూడలేదు. సఫియా దగ్గరగా నడిచి ఆమెచేతిలోని పిల్లాణ్ని ఎత్తుకుని ముద్దు పెట్టుకున్నాడు. సఫియా చున్నీతో ఆమె కళ్లు తుడిచి..

''నీకు తలాక్ ఇస్తె.. అల్లా నాకు శాపం ఇస్తడు. ఈ మెహర్ నాకే ఉండాలె!'' అన్నాడు కన్నీళ్లతో. ■

## నెల్లుట్ల రమాదేవి



సామాన్యుల ఎతలను.. అసామాన్య కథలుగా మలుస్తున్నారు నెల్లుట్ల రమాదేవి. వీరి స్వస్థలం ఉమ్మడి వరంగల్ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్. ఎంఏ చదివారు. ఆంధ్రాబ్యాంక్‌లో సీని యర్ మేనేజర్‌గా పనిచేసి విరమణ పొందారు. కార్టూన్లు గీయడం, కథలు, కవిత్వం రాయడం ప్రవృత్తిగా చేసుకున్నారు. వందల సంఖ్యలో కథలు, కవితలు రాశారు. మనసు భాష (కవిత్వం), రమణీయం (కార్టూన్లు), మనసు మనసుకూ మధ్య (కథలు), చినుకులు (నానీలు), తల్లి వేరు (కథలు) పుస్తకాలను వెలువరించారు. 2004లో సుశీలా నారాయణ రెడ్డి పురస్కారం, 2014లో అపురూప అవార్డు అందుకొన్నారు. వరంగల్ ఉమ్మడి జిల్లా స్థాయిలో ఉత్తమ రచయిత్రి పురస్కారం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నుంచి కీర్తి పురస్కారం, జాతీయ సాహిత్య పరిషత్తు, సిద్దిపేట వారి ఐతా భారతి – చంద్రయ్య సంప్రదాయ కథా సాహితీ పురస్కారాలు దక్కించుకున్నారు. గిడుగు రామ్మూర్తి పంతులు ఫౌండేషన్ అవార్డు, పర్చా రంగారావు స్మారక పురస్కారం, తిరుమల స్వరాజ్యలక్ష్మి సాహితీ పురస్కారంతోపాటు ఉత్తమ కార్టూనిస్టుగా బాపు – రమణ అకాడమీ నుంచి రాగతి పండరి స్మారక పురస్కారం అందుకొన్నారు.